క్లుప్తంగా

నేడు ఎర్రవల్లిలో విద్యుత్ అంతరాయం

అలంపూర్: ఎర్రవల్లి మండలంలో గురువారం విద్యుత్ అంతరాయం ఉండనున్నట్లు సబ్ డివిజనల్ ఏడీఈ సయ్యద్ మక్బుల్, ఎర్రవల్లి ఏఈ జీవీ రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన, నిరంతరాయంగా విద్యుత్ అందించడానికి ఎర్రవల్లి మండలంలోని 33/11 కేవీ బీచుపల్లి సబ్ స్టేషన్‌లో 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎర్రవల్లి, బీచుపల్లి, తిమ్మాపూర్, యాక్తాపూర్, కొండపేట, కొండేరు, జింకలపల్లి, బీచుపల్లి దేవస్థానం, 10వ బెటాలియన్, వ్యవసాయ, వాణిజ్య సర్వీసులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు, వ్యాపారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మానవపాడు: మండలంలోని అమరవాయికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ బోయ గణేష్‌నాయుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్ అహ్మద్ పరామర్శించి, మృతదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాళ్లకు సన్మానం

మల్దకల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రమేష్‌లింగం సేవలు మరువలేనివని జిల్లా ఇంటర్మీడియటల్ విద్యాధికారి హృదయరాజు అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ రమేష్ లింగం బదిలీపై వెళ్లడంతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం అధ్యాపక బృందం శాలువా, పూలమాలతో సత్కరించారు. ధరూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కృష్ణ మల్దకల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు.

గట్టు కళాశాల ప్రిన్సిపాల్‌గా హృదయరాజు

గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డీఐఈఓగా పని చేస్తున్న హృదయరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అయిజకు బదిలీపై వెళ్తున్న శశిధర్‌రెడ్డిని సన్మానించారు.

24న ఎస్‌జీఎఫ్ పోటీలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆటపోటీలు ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు పాఠశాల పీడీ శైలజ బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అండర్–14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24 ఉదయం 9 నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

మండల స్థాయి క్రీడాపోటీలు

గట్టు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 24న మాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నర్సింహులు, జీహెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన అండర్–14, 17 విభాగంలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులను తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. ఆయా పాఠశాలలకు చెందిన పీడీ, పీఈటీలు ఈ నెల 24న ఉదయం 9 గంటలకు మాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో హాజరు కావాల్సి ఉంటుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, కన్వీనర్ నిర్మలాదేవి తెలిపారు.

ధర్నాకు తరలిరండి

అయిజ: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య బుధవారం ప్రకటనలో తెలపారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని రాయచూరు–కర్నూలు చౌరస్తా రోడ్డుపై ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి నాయకులు, కార్యర్తలు, రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

ఆరాధనోత్సవాలు

ఆత్మకూర్: సీతారామాంజనేయ సమేత రాఘవేంద్రస్వామి ఆలయంలో రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం నిర్మాల్యవిసర్జనం, పంచామృతాభిషేకం, అర్చన, అష్టోత్తరం, స్వామివారి పల్లకీసేవ తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించి అన్నదానం చేశారు. జ్యోషిగుండాచారి, రవికుమార్‌దేశాయ్, రాజు, భక్తులు పాల్గొన్నారు.



బండలపై నిర్మించిన జ్యోతి నివాసం

పూరి గుడిసెల్లో పొంచి ఉన్న ప్రమాదం

- వర్షాలకు తడిసిన గోడలు
- ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి

అయిజ: ఓ నిండు ప్రాణం బలైతే తప్పా అధికారులు స్పందించరని చెప్పేందుకు బుధవారం గోడ కూలి పట్టణానికి చెందిన చిన్నారి శ్రీకృతి మరణం ఒక ఉదాహరణ. మున్సిపాలిటీలోని 14వ వార్డులోని కొత్తపేటలో పేదవారు పూరిగుడిసెలు వేసుకొని 25ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. అయితే వర్షం పడితే గుడిసెల చుట్టూ వర్షం నీరు చేరుకుంటుంది. ఇటుకల గోడలు తడిసి శిథిలావస్థకు చేరుతున్నాయి. చిన్నారి శ్రీకృతి విషయంలో అలాగే జరిగింది. అయితే గోడ కుప్పకూలి చిన్నారి మృతి చెందిన గుడిసె పక్కనే కుప్పకూలేందుకు మరో ఐదు గుడిసెలు సిద్ధంగా ఉన్నాయి. ఎరుకలి జ్యోతి చెందిన గుడిసె శిథిలావస్థకు చేరింది. అదేవిధంగా మరో గుడిసె కూలిపోతుందనే భయంతో ఎరుకలి నర్సింహులు ఏడాది క్రితం తన ఖాళీచేసి వెళ్లిపోయాడు. అదేవిధంగా కుర్వ వెంకటమ్మ గుడిసె పూర్తిగా దెబ్బతింది. దానికెదురుగా ఉన్న మైబునా గుడిసె చుట్టూ నీళ్లు నిలిచిపోయాయి. చాకలి రాజు గుడిసె కుప్పకూలేందుకు సిద్ధంగా ఉంది. భారీ వర్షానికి గోడకూలి మృతి చెందిన శ్రీకృతి మరణంతోనైనా అధికారులు కళ్లు తెరుస్తారో లేదో వేచి చూడాలి.



కూలేందుకు సిద్ధంగా ఉన్న బోయ లక్ష్మన్న గుడిసె

ప్రభుత్వం సాయం చేయాలి



పూరి గుడిసెల్లో బతుకుతున్న మాకు ప్రభుత్వం సాయం చేయాలి. గుడిసెల చుట్టూ మురుగు నిలిచి ఉంది. దోమలు ఉధృతి చెంది రోగాల బారిన పడుతున్నాం. మా గుడిసె ఎప్పుడు కూలుతుందోననే భయం వెంటాడుతుంది. ప్రభుత్వం మాకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– ఎరుకలి జ్యోతి, 14వ వార్డు, కొత్తపేట కాలనీ

అధికారులు గుర్తించాలి



గుడిసెలు, పాత ఇళ్లు కూలిపోయి ప్రజలు మృతి చెందక ముందే అధికారులు గుర్తించాలి. బాధితులకు పునరావాసం కల్పించాలి. ప్రభుత్వం పేదవారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

– బోయ లక్ష్మన్న, 14వ వార్డు, కొత్తపేట కాలని

ఊరి చివరన ఉన్నాం



మున్సిపాలిటీలో ఉన్నాసరే మేము ఊరి చివరన ఉన్నాం. మా బాగోగులు ఎవరూ పట్టించుకోవడంలేదు. గుడిసెల చుట్టూ మురుగు నెలల తరబడి నిలిచి ఉంది. అయినా సరే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోరు. మురుగు దుర్వాసన వస్తుంది. పాములు, తేళ్లు గుడిసెల్లోకి వస్తున్నాయి. గుడిసెలు కూలిపడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకోవాలి.

– మాలున్ బీ, 14వ వార్డు, కొత్తపేట కాలని

వర్గీకరణ ముసుగులో విడదీసే కుట్ర



అలంపూర్‌లో ధర్నా చేస్తున్న మాలమహానాడు నాయకులు

అలంపూర్: వర్గీకరణ ముసుగులో దళితులను విడదీసే కుట్ర జరుగుతుందని మాల మహానాడు నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మలహానాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా పట్టణంలో బుధవారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలను, వ్యాపారులను బంద్ చేయించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విభజించి పాలించే విధానాలు మానుకోవాలన్నారు. ప్రభుత్వాలు దళితుల అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రవి కుమార్, రజని బాబు, పరశురాముడు, ఎర్రన్న, బుచ్చన్న, వేణు, శరత్‌కుమార్, వెంకటేష్, ఆనంద్‌బాబు, నాగన్న, బాలరాజు తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం కుట్ర

ఎర్రవల్లి: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. బుధవారం ఎర్రవల్లి, ఇటిక్యాల మండల కేంద్రాల్లో భారత్ బంద్‌లో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ రిజర్వేషన్లకు వ్యతిరేఖి అని అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు పునరాలోచించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలంగా ఉంటూ క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేస్తామంటూ భవిష్యత్ తరాలకు రిజర్వేషన్లు లేకుండా ఉండేందుకు చూస్తుందని విమర్శించారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే బీజేపీ అలా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో మణికుమార్, సికింధర్, బీసన్న, ధర్మతేజ, సుంకన్న, రాజు తదితరులు ఉన్నారు.



ఇటిక్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



అలంపూర్: బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి ఆర్యవైశ్యులకు దక్కడం గర్వంగా ఉందని ఆర్యవైశ్య గ్రామీణ అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ జయరామయ్య శెట్టి అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులోని న్యాయవాదుల కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మలిపెద్ది సురేష్ కుమార్‌ను బుధవారం శాలువాతో సత్కరించారు. న్యాయ వాదుల సమస్యల పరిష్కారంలో అధ్యక్షుడు ముందుంటారని ఆకాంక్షించారు. చరణ్ తేజ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యాకోబు, కోశాధికారి గవ్వల శ్రీనివాసులు, న్యాయవాదులు నాగరాజు యాదవ్, తిమ్మారెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ రామకృష్ణ బుధవారం పరిశీలించారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవితో కలిసి పాఠశాలల్లోని రికార్డులు, విద్యార్థుల సంఖ్యను తనిఖీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ వారి గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టీచర్లకు సూచించారు.

రోడ్డుపై ఇరుక్కుపోయిన టిప్పర్

ధరూరు: మండలంలోని మార్లబీడులో కంకర లోడ్‌తో వెళ్తున్న ఓ టిప్పర్ ఇరుక్కుపోయింది. బుధవారం సాయంత్రం గట్టు వైపు వెళ్తున్న టిప్పర్ రోడ్డు పక్కకు వెళ్లింది. గుంతలమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. కాగా ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. ఆర్టీసీ బస్సులు, బైక్‌లు నిలిచిపోయాయి. మరో వాహనాన్ని తెప్పించి ఇరుక్కుపోయిన టిప్పర్‌ను బయటకు తీశారు.



అడ్డుకట్ట పడేనా..?



తుమ్మిళ్ల ఎత్తిపోతల వద్ద దెబ్బతిన్న పైపులైన్ రోడ్డు

- అగమ్యగోచరంగా తుమ్మిళ్ల లిఫ్టు, పైపులైన్ రోడ్డు
- ఇసుక ట్రాక్టర్లు, లారీలు తిరగడంతో దెబ్బతిన్న మార్గం

రాజోళి: డెస్ కెనాల్‌పై పర్యటిస్తూ కెనాల్ బాగోగులను చూసేందుకు అధికారులు ఏర్పాటు చేసుకున్న రోడ్లకు భద్రత కరువైంది. అక్రమంగా వాహనాల రాకపోకలు చేస్తుండటంతో రోడ్డు దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ రోడ్డుపై ఇతరులు తిరిగేందుకు వీలుండదు. కానీ రైతులు, చుట్టు పక్కల గ్రామాల వారు ఆ రోడ్డును ఉపయోగించుకుంటారు. అత్యవసర సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ద్విచక్రవాహనాలపై వెళ్తుంటారు. నిరంతరం పెద్ద వాహనాలు తిరగడం వల్ల రోడ్డు గుంతలు పడి రాకపోకలకు పనికిరాని విధంగా తయారైంది.

పైపులైన్‌కు పొంచి ఉన్న ముప్పు

తుమ్మిళ్ల ఎత్తిపోతల నుంచి పచ్చర్ల మీదుగా తనగలలోని డీ–23 వరకు ఏడు కిలోమీటర్ల డబుల్ పైపులైన్ వేశారు. దీని పక్కనే పర్యవేక్షణ కోసం రోడ్డును వదిలారు. అప్పటి నుంచి ఆ రోడ్డుపై అక్రమంగా తిరిగే వాహనాల సంఖ్య పెరిగింది. ఇసుకను అక్రమంగా తరలించే ట్రాక్టర్లు, తుమ్మిళ్ల నుంచి పచ్చర్ల, తనగల మీదుగా వెళ్లడం, తుమ్మిళ్లలో గతంలో టీఎస్‌ఎండీసీ ద్వారా అనుమతి పొందిన ఇసుక రీచ్ ఉండటంతో, అక్కడి నుంచి ఇదే మార్గంలో టిప్పర్లు రోజూ పదుల సంఖ్యలో తిరగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆ మార్గంలో తిరగకూడదని సంబంధిత అధికారులు ఎన్ని సార్లు చెప్పినా, అలాగే తిరగడంతో అధికారులు గుంతతీసి, ముళ్ల కంచె అడ్డుగా పెట్టారు. అయినా పక్క నుంచి దారి మళ్లించుకుని వెళ్తుండడంతో అధికారులకు ఏమి చేయాలో తెలియడం లేదు. సాధారణ రాకపోకలకు పచ్చర్ల, తుమ్మిళ్ల, అశోక్‌నగర్, పెద్ద తాండ్రపాడు గ్రామాల వారికి అనుకూలంగా ఉంది. అత్యవసర సమయంలో ఆస్పత్రులకు, మండల కేంద్రానికి వెళ్తున్నారు. పెద్ద వాహనాలు ఈ మార్గం ఉపయోగిస్తే అందరికి ఇబ్బందులు కలుగుతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

ఒకవైపు మూసేశాం..

తుమ్మిళ్ల లిఫ్టు నుంచి డెస్ కెనాల్ వరకు పైపు లైన్ ఉంది. ఈ రోడ్డుపై సాధారణ వాహనాలు తిరిగితే ఏ ప్రమాదం లేదు. పెద్ద వాహనాలు తిరిగితే ఆ ప్రభావం పైపులైన్‌పై పడుతుంది. ఈ విషయం టిప్పర్లు నడిపేవారికి ఎన్నోసార్లు చెప్పాం. అయినా తిరుగుతుండటంతో పచ్చర్ల వైపు రోడ్డుకు అడ్డుగా ముళ్ల కంచె పెట్టాం. రోడ్డును బీటీ చేయడంపై అధికారులకు తెలియజేస్తాం.

– వరుణ్, ఆర్‌డీఎస్ ఏఈఈ



భారీ వాహనాలు తిరగకుండా రోడ్డుకు అడ్డుగా వేసిన కంచె

ఓటరు నమోదుపై శిక్షణ

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలకు ఓటర్ నమోదుపై వీసీ నిర్వహించినట్లు డీటీ శివశంకర్ తెలిపారు. త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం చేయాలని సూచించారు. తప్పులు సరి చేయడం, కొత్త ఓటర్లను నమోదు చేసుకోవడం తదితర పనులు ప్రారంభించాలని సూచించారు.

ఎర్రవల్లి: బీఎల్‌ఓలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఓటర్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాలకు చెందిన బీఎల్వోలకు ఓటర్ల సర్వేపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ, యువకులను గుర్తించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. మృతి చెందిన ఓటర్ల వివరాలను వారి కుటుంబ సభ్యుల ద్వారా గుర్తించాలన్నారు.

రేపు బ్లాక్ డేను విజయవంతం చేయండి

గద్వాల అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులను సీపీఎస్ విధానంలో కొనసాగిస్తామని 2014 ఆగస్టు 23న ఉత్తర్వులు జారీ చేసి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం చేశారని, దీనిని నిరసిస్తూ 23న జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆఫీసు ఆవరణలో బ్లాక్ డేను నిర్వహించనున్నట్లు సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని శాఖల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విష్ణు, రమేష్‌కుమార్, నర్సింహ, రఘు, ఎల్లస్వామి, తిమ్మన్న తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాగరాజు

దాడులను ఆపేలా చర్యలు తీసుకోవాలి

గద్వాల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యలు, దారుణాలను తక్షణమే ఆపేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గద్వాల ఐక్య హిందూ సంఘాలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం గద్వాల బంద్ చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంట నిరసరన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్‌రావు, వైండింగ్ రాములు, నర్సింహులు, శ్రీనివాసులు, శ్రీకాంత్, శివారెడ్డి, రాము, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: వీహెచ్‌పీ, బీజేపీ, కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. దాడులను వెంటనే బంగ్లాదేశ్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అయిజ–గద్వాల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు.

ధరూరు: గద్వాల బంద్ పిలుపు నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉదయం నుంచే బంద్ పాటించాయి.



గద్వాలలో ర్యాలీ చేపడుతున్న సంఘాల నాయకులు

మొక్కలకు జియో ట్యాగింగ్

శాంతినగర్: మొక్కలకు జియో ట్యాగింగ్ తప్పనిసరిగా చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మండల మహిళా సమాఖ్య భవనంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కలెక్టర్ సూచన మేరకు మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జియో ట్యాగింగ్ విషయమై ఏపీఓ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఏక్ పేడ్ మాక నామ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

వాహనాల తనిఖీ



అయిజ: మండల కేంద్రంలోని రాయచూర్–కర్నూల్ రోడ్డు చౌరస్తాలో బుధవారం రాత్రి ఎస్ఐ విజయ భాస్కర్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల నంబర్ ప్లేట్, రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. సరైన అనుమతి పత్రాలు లేని వారి వాహనాలకు జరిమానా విధించారు. చిన్నపిల్లలకు బైక్‌లు, కార్లు ఇవ్వరాదని, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ సూచించారు.

రైతులకు అందని రుణమాఫీ

మానవపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలలో రుణమాఫీ ఒకటి. అధికారులకు కావాల్సిన సమాచారం రైతులు అందిస్తున్న నేటికి రైతుల ఖాతాల్లో రుణాలు జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీసీసీబీ శాంతినగర్ శాఖకు చెందిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోయారు. జిల్లాలోని చాలా బ్యాంకుల్లో రైతులకు అధికారులు రుణాలు చెల్లించారు. కానీ మండలంలోని సహకార సంఘం పరిధిలో రుణమాఫీ కాగా, కొంతమంది కాలేదని తెలిపారు. మానవపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 1,023 మంది రుణాలు తీసుకోగా అందులో 551 మంది రైతులకు రుణమాఫీకి అర్హులు. వీరిలో 150 మంది రుణమాఫీ చెల్లించారు. ఇందులో 70మంది వారి ఖాతాను మూసివేశారు. మిగతా 331 మందికి రుణమాఫీ చెల్లించాల్సి ఉండగా, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి రోజు కొంతమంది ఖాతాలో వేస్తుండడంతో రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రుణమాఫీ త్వరగా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

‘పరిహారం ఇవ్వండి’

రాజోళి: వాగులు పొంగి పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి బుధవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసలే ప్రతికూల వాతావరణంతో రైతులు దిగాలు చెందుతుంటే, వరదల కారణంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వరి పంటలు నీట మునిగాయని, వారికి తక్షణమే పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

అన్ని విధాలా అండగా ఉంటాం: ఎస్పీ

గద్వాల క్రైం: అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఇటిక్యాల హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కుటుంబ సభ్యులకు బుధవారం ఎస్పీ శ్రీనివాసరావు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలకు పోలీసు శాఖపై నమ్మకం కలిగించారన్నారు. కార్పస్ ఫండ్ ద్వారా విడుదలైన రూ.49,800, విడో పెన్షన్ కింద రూ.10వేల చెక్కును భార్య రాజేశ్వరికి ఎస్పీ అందజేశారు. ఎక్స్‌గ్రేషియా త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా ఉన్న కుడి కాల్వ

గండి పడితేనే స్పందిస్తారా?

ధరూరు: ఇదిగో ఇక్కడ మట్టి కూరుకుపోయి ప్రమాదకరంగా కనిపిస్తున్న ఈ కాల్వ ప్రాంతం మండల పరిధిలోని గుడ్డెందొడ్డి గ్రామ శివారులో ఉంది. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ కుడికాల్వపై రెండు పైపులను వేసి మట్టి పోసి వంతెనగా వాడుతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం లిఫ్టు–1 గుడ్డెందొడ్డి పంప్‌హౌజ్ అధికారులు, అటు వైపు ఉన్న రైతులు తిరుగుతూ ఉంటారు. రెండేళ్ల క్రితం అదే ప్రాంతానికి రెండు వందల మీటర్ల దూరంలో కాల్వ తెగి వందలాది ఎకరాల పంట నీట మునగడంతో పాటు భారీ నష్టం వాటిల్లింది. అదే సంఘటన మళ్లీ పునరావృతమయ్యే అవకాశాలున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– ప్రశ్నించాల్సిన అధికారి పేరు : రహీముద్దీన్, పీజేపీ ఈఈ, ధరూర్.
ఫోన్ నంబర్: 9989964419